విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. టాపర్లుగా నిలిచిన జ్యోతిలక్ష్మి, ప్రియాంకగుప్తా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, డీఐఈఓ కిషన్, విద్యార్థుల తల్లిదండ్రులు అనంతయ్య, మనోజు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీనిచ్చారు. వల్లభ్‌నగర్‌లోని సీనియర్ జర్నలిస్టు మచ్చారి రమేశ్ తండ్రి దశదిన కర్మకు గురువారం ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ తండ్రి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేశ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్, డివిజన్ నాయకులు హరినాథ్, పోచయ్య, అశోక్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు నాగరాజు మృతి తీరని లోటు

● కాంగ్రెస్ నేతల నివాళి



నాగరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్

బాలానగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు నాగరాజు మృతి పత్రికా రంగానికి తీరని లోటని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. గురువారం సీనియర్ జర్నలిస్టు నాగరాజు దశదిన కర్మకు కాంగ్రెస్ నేతలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జర్నలిస్టుగా నాగరాజు సమాజ సేవ కోసం పనిచేశాడని వారు కొనియాడారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి



భరత్‌నగర్ ఎల్‌ఐజీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

ఫతేనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. భరత్‌నగర్ ఎల్‌ఐజీలో రూ.31లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతోనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ తెలిపారు. డ్రైనేజీ సమస్యకు గతంలో నూతన పైపులైన్ వేశామని, డ్రైనేజీ పనులు పూర్తికావడంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్, డివిజన్ నాయకులు కంచి భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, సోమయ్య, సాంబశివరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హాట్ సమ్మర్..

కూల్ బిజినెస్





కూకట్‌పల్లిలో జ్యూస్ తాగుతున్న ప్రజలు

- జ్యూస్‌సెంటర్లు.. ఐస్‌క్రీం పార్లర్లకు పెరిగిన గిరాకీ
- కొబ్బరిబొండాలు, నిమ్మకాయ సోడాకు డిమాండ్
- ఎండ నుంచి ఉపశమనం పొందుతున్న జనం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదవుతున్నాయి. ముందు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. వేసవి తాపం నుంచి చల్లబడేందుకు నగర ప్రజలు పండ్ల రసాలు, శీతల పానియాలు, ఐస్‌క్రీం పార్లర్లను ఆశ్రయిస్తుండడంతో చల్లని వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. చీకటి పడినా భానుడి భగభగ తగ్గకపోవడంతో పొద్దుపోయే వరకు గిరాకీలు అవుతున్నాయి.

జ్యూస్ సెంటర్లకు పెరిగిన డిమాండ్

కూకట్‌పల్లిలో జ్యూస్ సెంబర్లు జోరుగా సాగుతున్నాయి. కూల్‌డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరం అంటూ పలువురు వైద్యులు, ఆరోగ్య నిపుణులు చెబుతుండడం, సామాజిక మాధ్యమాల్లో ఈ విషయం వైరల్ కావడంతో ప్రజలు పండ్ల రసాల వైపు మొగ్గు చూపుతున్నారు. కూకట్‌పల్లిలో కొబ్బరిబొండాలు, చెరుకు బండ్లు, జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీం పార్లర్లు జనంతో రద్దీగా కనిపిస్తున్నాయి.

పెరిగిన విక్రయాలు

గతేడాదితో పోలిస్తే ఈసారి కొబ్బరి బొండాల విక్రయాలు పెరిగాయి. ఒక్కో కొబ్బరిబొండా రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముతున్నాం. లీటర్ రూ.120 వరకు అమ్ముతున్నాం. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు ప్రాంతాల నుంచి కొబ్బరిబొండాలను తీసుకువస్తున్నాం.

- వెంకటేశ్, కూకట్‌పల్లి

కొబ్బరి బొండాలపై మక్కువ



భానుడి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఎక్కువగా కొబ్బరిబొండాల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. కూకట్‌పల్లిలోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో, పలుకాలనీలో కొబ్బరిబొండాల విక్రయం జోరుగా కొనసాగుతోంది. ఎండ తీవ్రతకు శరీరం వేడెక్కి దాహం వేస్తోంది. కొబ్బరినీళ్ల తాగడం ద్వారా అందులోని ఖనిజాలు, విటమిన్లు శరీరానికి వేడిని తగ్గించి చల్లదనాన్ని అందిస్తాయి. వైద్యులు కూడా వేసవిలో కొబ్బరిబొండా తాగడం ఉత్తమమని చెబుతున్నారు. అందుచేత ఎక్కువగా కొబ్బరి బొండాలపై మక్కువ చూపుతున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 15, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 38, క్యాబేజీ 10, బీన్స్ 75, క్యారెట్ 19, గోబి పువ్వు 18, దొండకాయ 23, చిక్కుడుకాయ 45, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీర 20, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 15, కంద 85, ఉల్లిపొరక 23, ఉల్లిగడ్డ 18, మామిడికాయ 15-20, అరటికాయ 8-9, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 25, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 60-70, మునగకాయలు 5-6, పచ్చిబఠాణీ 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 60, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 35, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చెరువుల సుందరీకరణకు సంపూర్ణ సహకారం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు



హైడ్రా అధికారులు రూపొందించిన నల్లచెరువు సుందరీకరణ నమూన చిత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని చెరువుల సుందరీకరణకు సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైడ్రా అధికారులు రూపొందించిన నల్ల చెరువు సుందరీకరణ నమూన చిత్రాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూకట్‌పల్లిలోని 9 చెరువులు, 2 కుంటల అభివృద్ధిపై ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వివరాలు అందించినట్లు ఆయన తెలిపారు. హైడ్రా అధికారులు సున్న చెరువు, కాముని చెరువు ప్రాంతాలను పరిశీలించారని తెలిపారు. భూ యజమానులు, పట్టాదారులకు టీడీఆర్‌లు ఇచ్చేందుకు హైడ్రా అధికారులు సుముఖత వ్యక్తం చేశారన్నారు. డివిజన్‌లోని నల్ల చెరువులో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయని, సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో చెరువు సుందరీకరణ పనులు జరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కాముని చెరువు, నల్లచెరువుల్లో నాలా డైవర్షన్ చేయాలని, సున్నచెరువు వద్ద రోడ్డుమార్గం ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశామని చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



హైదర్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. హైదర్‌నగర్ జల వాయువిహార్, రాంనరేశ్‌నగర్, అల్లాపూర్ సొసైటీ, షైనార్టీ స్కూల్, విజేత గ్రీన్‌హోమ్స్, కిందికుంట చెరువు నుంచి కోనసీమ వంటిల్లు, హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌లో రూ.2.9కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గురువారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేస్-1. 2, తులసి నగర్, కాకతీయ నగర్, చంద్రమ్మబస్తీ, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్ రూ.2.8కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ప్రజలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈ నెల 28 నుంచి శంకర జయంతి ఉత్సవాలు

● కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ తొమ్మిదో ఫేజ్‌లోని విజయగణపతి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి మే 2 వరకు శంకర జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని, ముగింపు రోజున అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, కట్టా శేఖర్‌రెడ్డి, కోదండ రామయ్య, రాజేశ్ రాయ్, జన్ను సాయి శ్రీనివాస్, గంగూరి శ్రీనివాస్, హనుమంతరావు, దాశరథి, దూసి సాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● కార్పొరేటర్‌కు మహిళల ఫిర్యాదు



తాగునీటి సమస్యను కార్పొరేటర్‌కు వివరిస్తున్న కాలనీ మహిళలు

అల్లాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్ నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు కార్పొరేటర్ సబీహాబేగంను కోరారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సరిపడా నీరు రాకపోవడంతో తామంతా వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సబీహాబేగం వెంటనే అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో లింగాల ఐలయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఈ నెల 27న గీతా సమ్మర్ క్యాంప్ ప్రారంభం

హైదర్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొండపల్లిలోని డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 27న గీతా సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్నామని కూకట్‌పల్లి ఇస్కాన్ అధ్యక్షుడు మహాశృంగదాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల 6 వరకు ఈ సమ్మర్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. 35 సంవత్సరాలుగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జీవితంలో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడం, నాయకత్వ లక్షణాల పెంపు, పిల్లలకు మానవీయ విలువలు, వేద సంస్కారాలను ఈ క్యాంపులో బోధిస్తామని చెప్పారు.



డీసీపీకి వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్, బాధితురాలు లక్ష్మి

'దర్గా స్కూల్ హెడ్‌మాస్టర్‌పై చర్యలు తీసుకోండి'

రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి మండల పరిధిలోని దర్గా హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్‌కె తాజ్‌బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్, బాధితురాలు లక్ష్మి కోరారు. కేవీపీఎస్ శేరిలింగంపల్లి మండల పరిధిలోని దర్గా హైస్కూల్‌లో హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న తాజ్‌బాబు ప్రైమరీ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న లక్ష్మిని లైంగికంగా, కులం పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడని, తమ సంఘం ఆధ్వర్యంలో డీసీపీకి వినతి పత్రం అందించామన్నారు. గత నెల 28న రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయనను అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరామన్నారు. దీనికి డీసీపీ వినీత్ స్పందించి ఏసీపీ శ్రీకాంత్‌తో ఈ కేసును త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ డాక్టర్‌పై మియాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు

మియాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మదీనగూడలోని అంకుర హాస్పిటల్‌లో తప్పుడు సర్టిఫికెట్లతో వైద్య వృత్తి చేపడుతున్న వ్యక్తిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. మదీనగూడ అంకుర ఆస్పత్రిలో డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా కలపాల భరత్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. ఫేక్ సర్టిఫికెట్స్‌తో ఆయన అంకుర ఆస్పత్రిలో చేరినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. ఆ ఆస్పత్రిలో పీడియాట్రిక్ డాక్టర్‌గా, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. భైరం భరత్‌కుమార్ అనే మరో వ్యక్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ నెంబర్ వాడుకుంటూ తన తండ్రి పేరు సైతం పత్రాలతో మార్చేశాడు. సర్టిఫికెట్లను పరిశీలించకుండా అంకుర యాజమాన్యం భరత్‌ను ఎలా విధుల్లోకి తీసుకుందని, ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా భరత్ బాగోతం బయటపడింది. భరత్ కుమార్ నకిలీ సర్టిఫికెట్లతో 2016 నుండి 2026 వరకు ఉన్నట్లు తెలిపారు. కానీ మెడికల్ కౌన్సిల్‌లో ఐదేళ్ల మాత్రమే కాల పరిమి తి ఉంటుందన్నారు. భరత్ పూర్తిడేటాను సేకరిస్తున్నామన్నారు. అధికారుల విచారణలతో తానే మోసపోయానని భరత్‌కుమార్ తెలిపినట్లు సమాచారం. ఉక్రెయిన్‌లోని ఓ మెడికల్ కళాశాలలో చదివినట్లు సమాచారం. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

ఏపీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు



ప్లకార్డులు పట్టుకుని నిరసన దీక్షలో కూర్చున్న ఎమ్మెల్సీ నాగబాబు, రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రవాదులు దాడిచేసి కాల్చిచంపడం అమానుషమని ఏపీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ కూకట్‌పల్లి నిజాంపేట్ క్రాస్‌రోడ్డులో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజలింగం, కోశాధికారి రత్నం, ప్రచార కార్యదర్శి సాగర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ నాగబాబు పాల్గొన్నారు. ఉగ్రవాదం అంతం.. జనసేన పంతం అనే ప్లకార్డును పట్టుకొని నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు కేంద్రం ఆదుకుంటుందనే విశ్వాసం తనకు ఉందన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మాధవ రెడ్డి, నందగిరి సతీశ్, యడమ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైడబ్ల్యూఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులతో కార్పొరేటర్

బాలానగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మశాంతికై బాలానగర్ ఫిరోజ్‌గూడాకు చెందిన వైడబ్ల్యూఏ అసోసియేషన్ సభ్యులు గురువారం అసోసియేషన్ కార్యాలయం నుంచి ఫిరోజ్‌గుడా అంబేద్కర్ విగ్రహం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు ఎడ్ల ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల కవిత హాజరై ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉగ్రవాదులను ఉరితీయాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అవర్ యూత్ సభ్యులు

బాలానగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాంలో దేశ పౌరులను చంపిన ఉగ్రవాదులను ఉరి తీయాలని అవర్ యూత్ అసోసియేషన్ సభ్యులు, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టి ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ గురువారం అవర్‌యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రధాని మోదీ నిర్లక్ష్యం వల్లే ఉగ్రవాద దాడిలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 27 మందికి గాయాలయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాడుల్లో గాయపడిన వారిని కేంద్రం ఆదుకోవాలని వాఌ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవర్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాధవరం కాంతారావు, కర్ర వేణుగోపాల్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఛత్రపతి ధర్మరక్షణ సేన ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కర్ర వేణుగోపాల్ పాల్గొన్నారు. పహల్గాం ఘటన బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉగ్రవాదానికి తావులేకుండా పీఎం మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, పద్మయ్య, వినోద్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కళాకృతుల కనువిందు

గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాంగూడ, ఐటీజోన్‌లోని పలు కూడళ్లలో ఆకట్టుకుంటున్న చిత్రాలు







ఐటీ జోన్‌లో కూడళ్లలో ఏర్పాటు చేసిన కళాకృతులు







రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఐటీజోన్ అంతర్జాతీయ సంస్థలకు నిలయంగా మారిన తరుణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నగరాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాంగూడ, ఐటీజోన్‌లోని పలు కూడళ్లను ఆధునీకరించి కళాకృతులను ఏర్పాటు చేశారు. పలు రకాల జంతువులు, పక్షులు, క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే పలు థీమ్‌లతో రూపొందించిన కళాకృతులు ఐటీ జోన్ కూడళ్లలో ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా నగర సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో కూడళ్లలో, పలు సర్కిళ్లలో వన్యప్రాణుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలు రకాల భావాలు వ్యక్తపరిచేలా ఏర్పాటు చేసిన కళాకృతులు, వీటితో పాటు ఫ్లైఓవర్ల గోడలపై వేసిన పలు చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నగరంలోని పలు అంశాలకు ప్రసిద్ధిగాంచిన ప్రాంతాలను ప్రస్ఫుటంగా సందర్శకులకు వాటి ప్రత్యేకతను తెలియజెప్పే థీమ్‌తో చిత్రాలను రూపొందించారు. ఆయా ప్రాంతాల విశిష్టతతో కూడిన చిత్రాలతో ఐటీజోన్‌కు మరింత అందాన్ని తీసుకువస్తున్నాయి.



పోలీసులు స్వాధీనం చేసుకున్న హవాలా డబ్బు

ఇద్దరిపై హవాలా కేసు

రూ.74.56 లక్షల స్వాధీనం

రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న హవాలా డబ్బును రాయదుర్గం పోలీసులు బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రపురికాలనీ వద్ద బుధవారం రాత్రి సుమారు 9గంటల సమయంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా యాక్టీవాపై వెళ్తున్న చిత్రపురికాలనీకి చెందిన స్టూడెంట్ కృష్ణ, బార్బర్‌గా పనిచేస్తున్న ఆర్.రవిని ఆపి వాహనాలను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి రూ.74,56,200 నగదుకు సంబంధించి పత్రాలు చూపించమని అడిగారు. వారి దగ్గర ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని స్వాధీనం చేసున్న నగదును పంచనామా నిర్వహించి ఐటీ డిపార్టుమెంట్‌కు అప్పగించినట్లు తెలిపారు. వారిపై హవాలా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజారావు భూపాల్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయిమనోహర్, ఉపేందర్‌రెడ్డి

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాలను గురువారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డాక్టర్ గజారావు భూపాల్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయిమనోహర్, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. వీరు గచ్చిబౌలిలోని హెచ్‌సీడీ డిపో జంక్షన్, మజీద్‌బండ, ఆర్టీఏ కార్యాలయం, అంజయ్యనగర్ లేబర్ అడ్డా, జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.వర్షాకాలానికి ముందే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భారతీనగర్ డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా చేపడుతున్నామని డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో గల బీహెచ్ఈఎల్ హెచ్ఐజీ, ఎల్ఐజీ కాలనీ, మ్యాక్ సొసైటీ కాలనీలల్లో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సొసైటీ డైరెక్టర్లతో కలసి శంకుస్థాపన చేశారు. కాలనీలల్లో పార్కుల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో గల అన్ని కాలనీలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సొంత నిధులతో కొత్త మ్యాన్‌హోల్

స్పందించి అమర్చిన కార్పొరేటర్ శ్రీకాంత్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరమ్మతుకు ముందు మ్యాన్‌హోల్



మరమ్మతు తర్వాత

మియాపూర్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): 'ప్రమాదభరితంగా మారిన మ్యాన్‌హోల్' శీర్షికతో గురువారం వెలువడిన కథనానికి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్పందించి తన సొంత ఖర్చుతో మ్యాన్‌హోల్‌కు వాల్ కట్టించి పైకప్పు అమర్చారు. హెచ్ఎంటీ స్వర్ణపురి రోడ్డు ఆటోస్టాండ్ వద్ద నెల రోజుల క్రితం మ్యాన్‌హోల్ పైకప్పు పగిలి కూలిపోయింది. దీంతో అదిప్రమాదభరితంగా మారింది. ఈ విషయంపై కార్పొరేటర్.. జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించలేరు. దాంతో నేరుగా కార్పొరేటరే సొంత నిధులతో మ్యాన్‌హోల్ గోడ కట్టించి మ్యాన్‌హోల్ అమర్చారు.



కార్పొరేటర్‌కు కాలనీ సమస్యలు వివరిస్తున్న రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కాలనీల సమస్యలు, అభివృద్ధి పనులపై వినతి

మియాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ శ్రీలక్ష్మీ వెంకటనగర్, జనప్రియ వెస్ట్‌సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు తమ సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, లక్ష్మీవెంకటనగర్, జనప్రియ వెస్ట్‌సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కాలనీలో పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు సత్వరమే పరిష్కరించేలా అధికారులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శివ కోటేశ్వరరావు, ప్రసాద్, ఇమానియేల్, ఇన్నారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామలింగంగౌడ్, సోమిరెడ్డి, భాస్కర్‌రావు, మల్లికార్జున్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 27న గీతా సమ్మర్ క్యాంప్ ప్రారంభం

హైదర్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొండపల్లిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 27న గీతా సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్నామని కూకట్‌పల్లి ఇస్కాన్ అధ్యక్షుడు మహాశృంగదాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల 6 వరకు ఈ సమ్మర్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. 35 సంవత్సరాలుగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జీవితంలో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడం, నాయకత్వ లక్షణాల పెంపు, పిల్లలకు మానవీయ విలువలు, వేద సంస్కారాలను ఈ క్యాంపులో బోధిస్తామని చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి: ఎమ్మెల్యే ఆరెకపూడి



హైదర్‌నగర్‌లో సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం హైదర్‌నగర్ జలవాయువిహార్, రాంనరేష్‌నగర్, అల్లాపూర్ సొసైటీ, మైనార్టీ స్కూల్, విజేత గ్రీన్‌హోమ్స్, కిందికుంట చెరువు నుండి కోనసీమ వంటిల్లు, హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో రూ.2కోట్ల 9లక్షలతో చేపట్టబోయే సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపనచేశారు. అదేవిధంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేస్-1. 2, తులసినగర్, తులసినగర్, కాకతీయనగర్, చంద్రమ్మబస్తీ, పంచమికాలనీ, ఉజ్జయిని మహంకాళీనగర్ రూ.2.8 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీరోడ్డు పనులకు శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా నిలుపుతామన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

64 చెరువులను అభివృద్ధి చేస్తాం

రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ప్రశాంత్ హిల్స్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుమ్మరికుంటను హైడ్రా అధికారుల సహకారంతో కాలనీ వాసులు అభివృద్ధి చేశారు. కుమ్మరికుంటకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటును సైతం ఏర్పాటు చేశారు. చెరువు కబ్జాకు గురికాకుండా చెరువుచుట్టూ ఫెన్సింగ్ చేశారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు కాలనీ వాసులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చెరువును అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు జగదీశ్, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రాజు, పద్మ, అమర్, కాలనీ వాసులను ఆయన అభినందించారు.

ఫేక్ డాక్టర్‌పై మియాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు

మియాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మదీనగూడలోని అంకుర హాస్పిటల్‌లో తప్పుడు సర్టిఫికెట్లతో వైద్య వృత్తి చేపడుతున్న వ్యక్తిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మదీనగూడ అంకుర ఆస్పత్రిలో డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా కలపాల భరత్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. ఫేక్ సర్టిఫికెట్స్‌తో ఆయన అంకుర ఆస్పత్రిలో చేరినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. ఆ ఆస్పత్రిలో పిడియాట్రిక్ డాక్టర్‌గా, డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బైరం భరత్‌కుమార్ అనే మరో వ్యక్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ నెంబర్ వాడుకుంటూ తన తండ్రి పేరు సైతం పత్రాలతో మార్చేశాడు. సర్టిఫికెట్లను పరిశీలించకుండా అంకుర యాజమాన్యం భరత్‌ను ఎలా విధుల్లోకి తీసుకుందని, ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా భరత్ బాగోతం బయటపడింది. భరత్‌కుమార్ నకిలీ సర్టిఫికెట్లతో 2016 నుండి 2026 వరకు ఉన్నట్లు తెలిపారు. కానీ మెడికల్ కౌన్సిల్‌లో ఐదేళ్ల మాత్రమే కాల పరిమితి ఉంటుందన్నారు. భరత్ పూర్తిడేటాను సేకరిస్తున్నామన్నారు. అధికారుల విచారణలతో తానే మోసపోయానని భరత్‌కుమార్ తెలిపినట్లు సమాచారం. ఉక్రెయిన్‌లోని ఓ మెడికల్ కళాశాలలో చదివినట్లు సమాచారం. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ర్యాలీ



గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కొవ్వొత్తుల మార్చ్

శాంతి కలగాలని మనూ విద్యార్థుల ర్యాలీ

రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు కొవ్వొత్తుల మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని విద్యార్థులు నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ, ఇలాంటి చర్యలు తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు ఉగ్రదాడికి ఇస్లాం, ముస్లింలతో సంబంధం లేదన్నారు. ఇస్లాం శాంతి, న్యాయం కోసం నిలుస్తుందన్నారు. జాతీయ భద్రతను నిర్ధారించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



నివాళి

పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్, కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, పార్టీ నాయకులు మన్నెపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)

భ్రమరాంబ అమ్మవారికి బంగారు చీర



బంగారు చీరతో అమ్మవారు

చందానగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలోని భ్రమరాంబ మాతకు బంగారంతో తయారు చేసిన చీరను ఆలయ ఫౌండర్ చైర్మన్ యు.వి.రమణమూర్తి గురువారం ప్రధాన అర్చకులు మురళీధర్‌శర్మకు అందజేశారు. భ్రమరాంబ మాతకు బంగారు చీర చేయించాలని రమణమూర్తి సంకల్పించారు. అదే తడవుగా సుమారు రూ.5 లక్షలు వెచ్చించి బంగారు చీరను తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారికి గతంలో బంగారు నగలు చేయించామన్నారు. కొంతమంది దాతలు కూడా ఈ చీర తయారీకి సహకరించారని తెలిపారు.

సత్యసాయి మందిరంలో ఆరాధనోత్సవాలు

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోగల శ్రీ సత్యసాయిబాబా మందిరంలో గురువారం సత్యసాయి ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిత్య సేవా కార్యక్రమాలతో పాటు ఉదయం నగర సంకీర్తన, రుద్రపారాయణం, హోమం, సాయిగాయత్రి యజ్ఞం, అన్న సమారాధన, సాయంత్రం బాబా మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధన జరగగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డీసీపీకి వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్, బాధితురాలు లక్ష్మి

'దర్గా స్కూల్ హెడ్‌మాస్టర్‌పై చర్యలు తీసుకోండి'

రాయదుర్గం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి మండల పరిధిలోని దర్గా హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్‌కె తాజ్‌బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్, బాధితురాలు లక్ష్మి కోరారు. కేవీపీఎస్ శేరిలింగంపల్లి మండల పరిధిలోని దర్గా హైస్కూల్‌లో హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న తాజ్‌బాబు ప్రైమరీ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న లక్ష్మిని లైంగికంగా, కులం పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడని, తమ సంఘం ఆధ్వర్యంలో డీసీపీకి వినతి పత్రం అందించామన్నారు. గత నెల 28న రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయనను అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరామన్నారు. దీనికి డీసీపీ వినీత్ స్పందించి ఏసీపీ శ్రీకాంత్‌తో ఈ కేసును త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



చందానగర్ సర్కిల్ కార్యాలయం

'ఎర్లీబర్డ్'తో రాయితీ పొందండి: ఉపకమిషనర్

చందానగర్, 24 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎర్లీబర్డ్ పథకంతో 5శాతం రాయితీని ప్రకటించింది. ఏప్రిల్ చివరి నాటికి ఆస్తిపన్ను మొత్తం చెల్లించినట్లయితే వారికి 5శాతం రిబేట్ లభిస్తుందని చందానగర్ సర్కిల్ -21 ఉప కమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్ డివిజన్లలోని వివిధ కాలనీ, బస్తీల్లోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు గతేడాది ఎర్లీబర్డ్‌ను ఉపయోగించుకొని అనేక మంది రాయితీని పొందారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను ముందుగా ఏప్రిల్ చివరి నాటికి చెల్లిస్తే ఈ అవకాశాన్ని అంది పుచ్చుకోవాలని కోరారు. పన్ను చెల్లించండి.. జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించండి అనే విధానంతో అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ఎర్లీబర్డ్ పథకంతో చందానగర్ సర్కిల్-21 రూ.55 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశామన్నారు. ఈ ఏడాది చందానగర్ సర్కిల్‌కు ఉన్నతాధికారులు రూ.65 కోట్ల టార్గెట్ ఇచ్చారు. దీనిని పూర్తిచేయడానికి రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారు.



రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

గాజులరామారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తన కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ నుంచి ఏ పిలుపు వచ్చినా గాజులరామారం నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేస్తారని, అలాగే ఈ రజతోత్సవ సభకు కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, డివిజన్ యూత్ అధ్యక్షులు తెలంగాణ సాయి, శ్రీనివాస్‌యాదవ్, కమలాకర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం..

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ సంఘాల సమష్టి కృషితోనే కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం జీడిమెట్ల డివిజన్‌లోని శ్రీరాఘవేంద్రా కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను దండమూడి ఎన్‌క్లేవ్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్షేమ సంఘం సభ్యులు ఐక్యమత్యంగా ఉంటూ పార్టీలకతీతంగా పనిచేసినప్పుడే కాలనీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నూతన సంక్షేమ సంఘం సభ్యులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి ఉమాపతిరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరావు, కోశాధికారి ఎం. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సతీష్, బీఆర్ఎస్ నాయకులు కాలే నగేష్, గణేష్, బాలమల్లేష్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా ఈనెల 27న జరిగే వరంగల్‌లో జరిగే సభ పోస్టర్‌ను ఆ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ సమక్షంలో గురువారం ఆవిష్కరించారు. కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు ఈ నెల 27 చలో వరంగల్ సభకు పెద్ద తరలి రావాలని నాయకులకు, కార్యకర్తలకు రంగరాయ ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ తదితరులు

సీఎం సహాయనిధి ఎల్ఓసీ పత్రాల అందజేత

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మొత్తం రూ. 21 లక్ష 41 వేలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాలను గురువారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు గౌరీష్, సురేష్‌రెడ్డి, డివిజన్ నాయకుడు రఫీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ల అధ్యక్షులు విజయ్‌రామిరెడ్డి, రుద్ర అశోక్, పోలె శ్రీకాంత్, నాయకులు పరశు శ్రీనివాస్, కస్తూరి బాలారాజ్, గుమ్మడి మధు సూదన్‌రావు, కుంట సిద్దిరాము లు, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుడు పవన్‌కుమార్‌కు ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న రవిసింగ్

కార్మికులకు అండగా నిలుస్తాం

● బీఆర్ఎస్ నేత రవిసింగ్

షాపూర్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడలోని కార్మికులకు అన్యాయం జరిగితే వారికి అండగా నిలుస్తానని శ్రమశక్తి అవార్డు గ్రహీత, బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు రవిసింగ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్మికుడు పవన్‌కుమార్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూరారం డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని రిషిక్ ఇంజినీరింగ్ సర్వీస్‌లో కాంట్రాక్టర్ అవినాష్ వద్ద కొన్నేళ్లుగా పవన్‌కుమార్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ యాజమాన్యం పవన్‌కుమార్‌కు ఫిబ్రవరి నెల జీతం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో డ్యూటీకి వెళ్లడం మానేశాడు. జీతం కూడా ఇవ్వకుండా పలుమార్లు వేధింపులకు గురి చేశారు. కాంట్రాక్టర్ అవినాష్ కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కార్మికుడు రవిసింగ్‌ను కలవగా, స్పందించిన రవిసింగ్ యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపి కార్మికునికి న్యాయం చేశారు. కార్మిక నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.




కార్మికుల నూతన వేతన ఒప్పందంపై చర్చిస్తున్న మల్లారెడ్డి

'కార్మికుల హక్కుల సాధనకు కృషి'

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తానని హిల్టన్ టొబాకో కార్మిక సంఘం బీఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. కొంపల్లి పురపాలకసంఘంలోని హిల్టన్ టొబాకో పరిశ్రమ ఆవరణలో కార్మికుల సాధారణ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్యంతో చర్చించి కార్మికులకు నూతన వేతన ఒప్పందాన్ని కుదిర్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం సభ్యులు ఎస్. మల్లేశం, జయచందర్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మలేరియాతో జర జాగ్రత్త!

కనీస జాగ్రత్తలతో దూరం చేయొచ్చంటున్న వైద్యులు



నేడు మలేరియా దినోత్సవం

- వ్యాధికి ప్రధాన కారణం దోమలే
- పరిసరాల పరిశుభ్రతను పాటించాలి
- ఇంటి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రతియేటా ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటాం. మలేరియా వ్యాధి నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలిపేందుకే మలేరియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యులు చెప్తున్నారు.

వ్యాధికి కారణాలు...

ప్లాస్మోడియం అనే పరాన్నజీవి నుంచి మలేరియా వస్తుందని, ఆడ అనోఫిలిస్ దోమ కుట్టడం వల్ల ఒక వ్యక్తి నుంచి మరోవ్యక్తికి వ్యాపిస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.



బాల్‌రెడ్డినగర్ పార్కులోని నీటి కాలనులో పేరుకుపోయిన చెత్త, వర్షం నీరు

నివారణ మార్గాలు...

మన ఇళ్ల పరిసరాలను పరిశుభ్రం ఉంచుకుంటే ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉండదు. ఇంటి సమీపంలో మురుగు నీటి నిలువ, పరిసరాలను నిత్యం పరిశుభ్రం చేయకపోవడం, మురుగునీటి కాలువలు దోమల వ్యాప్తికి బీజం వేస్తాయి. వ్యాధి గురించి ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం, నివారణ చర్యలు పాటించకపోవడం వల్లే ఈ వ్యాధి వస్తుంది. ఇంటి పరిసరాల్లో కుండీలు, పాత టైర్లు, పాత డబ్బాలు, తాగిపాడేసిన కొబ్బరి బొండాలను పెట్టడం వల్ల అందులో నీరు నిలిచి దోమలు పెరుగుతాయి. అలా జరుగకుండా చూసుకోవాలి. ప్రధాన ముఖద్వారంతో పాటు కిటికీలు, వెంటిలేటర్లకు దోమల తెరలు అమర్చాలి. పరిసర ప్రాంతాల్లో అప్పుడప్పుడు దోమల నివారణ మందును పిచికారీ వేయించాలి. నిద్రపోయే సమయంలో దుప్పట్లను కప్పుకోవాలి.

సత్వర చర్యలు..

మలేరియా వ్యాధి సోకడానికి ప్రధాన కారణమైన దోమలను లేకుండా చూసుకోవాలి. ఏమైనా లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అధికార యంత్రాంగం బస్తీలు, కాలనీలలో దోమల నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు చైతన్యపరిస్తే మలేరియా దరి చేరదు.



వెన్నెలగడ్డలోని ఎర్రా చెరువులో ఆకుపచ్చగా మారిన నీరు, పేరుకుపోయిన చెత్త కుప్పలు

దోమల నివారణకు చర్యలు

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో దోమల నివారణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలు సైతం తమ నివాసాల వద్ద పాత డబ్బాలు, కుండీల్లో నీరు నిల్వలేకుండా చూసుకుంటే మంచిది. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు నిల్వ నీటిలో దోమల నివారణా మందు పిచికారీ చేస్తున్నాం.

ఉమారాణి,
ఎంటమాలజీ ఏఈ



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న రాళ్లు

కల్వర్టు నిర్మించి.. రాళ్లు వదిలేశారు!

జీడిమెట్ల, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కోటి రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కల్వర్టు పనులను కాంట్రాక్టర్ సక్రమంగా చేయకపోయినా బిల్లులు చెల్లించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. జగద్గిరిగుట్ట నుంచి షాపూర్‌నగర్ వెళ్లే దారిలో దశాబ్దాల కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణం చేపట్టింది. హడావుడిగా అధికారులు పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ కల్వర్టుపై వాహనాలు తిరుగుతున్నాయి. అయితే, కల్వర్టు రోడ్డుపై రెండు వైపులా ఉన్న పెద్దపెద్ద రాళ్లను కాంట్రాక్టర్ తొలగించలేదు, గోతులను కూడా పూడ్చలేదు. ప్రమాదకరంగా ఉన్న ఈ రాళ్ల కారణంగా కల్వర్టుపై రాత్రి వేళ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. గాజులరామారం ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



సుచిత్ర చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ

ఉగ్రవాదం నశించాలి: బీజేపీ

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా జీడిమెట్ల గ్రామంలోని మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, రూప్సీ, సిద్ధిరాములు, రాజు, సంజీవరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

సుచిత్ర చౌరస్తాలో..

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ, కశ్మీర్‌లో తీవ్రవాదుల దాడిలో అమరులైన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ గురువారం సాయంత్రం సుచిత్ర చౌరస్తా నుంచి జీడిమెట్ల గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జీడిమెట్ల చౌరస్తాలోని గాంధీ విగ్రహం దగ్గర మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భీమా ఫ్రైడ్ గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, టీఎన్ఆర్ నార్త్‌సిటీ రెసిడెన్సీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై అమరులకు నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: కూన

షాపూర్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి స్థానిక సమస్యలపై శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడతానన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న శ్రీశైలంగౌడ్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కా రమే ధ్యేయంగా పని చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్య క్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శంభీపూర్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల అసోసియేషన్ స భ్యులు ఎమ్మెల్సీని కలిసి రకరకాల సమస్యలను విన్నవించుకున్నారు. మీ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

నాలా పూడికతీత పనులను పూర్తి చేయండి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రషీదామహ్మద్ రఫీ

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాలా పూడిక తీత పనులను త్వరగా పూర్తి చేయాలని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదామహ్మద్ రఫీ సూచించారు. చింతల్ డివిజన్ పరిధి రంగానగర్‌లోని నాలాను ఆమె ఏఈ అశోక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ లైన్‌లు కూరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వరప్రసాద్, రామ్ ప్రసా ద్, నర్సయ్య, పద్మ, లక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'గుంతలు తవ్వి వదిలేశారు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డ ప్రధాన రహదారిలో రింగురోడ్డుకు వెళ్లే చౌరస్తాలో తవ్వి వదిలేసిన గుంతను అధికారులు గురువారం పూడ్చివేయించారు. దీంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

-(పేట్ బషీరాబాద్,ఆంధ్రజ్యోతి)

లింగంగౌడ్‌కు ఘన నివాళి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తన తండ్రి బాటలో నడుస్తూ పేదలకు సేవ చేసేందుకు ఎల్లప్పుడు ముందుంటానని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ బి.లింగంగౌడ్ 82వ జయంతి సందర్భంగా లింగంగౌడ్ ఘాట్ వద్ద ఆయన విగ్రహానికి తనయుడు, కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, లింగంగౌడ్ అభిమానులు పాల్గొన్నారు.



లింగంగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయ్‌శేఖర్‌గౌడ్

మా పిల్లల్ని వదిలేయండి.. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటా!

● హంగామా సృష్టించిన ద్విచక్ర వాహనదారుడు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులకు ఓ ద్విచక్ర వాహనదారుడు చుక్కలు చూపించాడు. గురువా రం షాపూర్‌నగర్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు త్రిబుల్ డ్రైవింగ్ చేస్తూ ముగ్గురు మైనర్లు పట్టుబడ్డారు. అయితే, తమ పిల్లల్ని వదిలేసి తనపై కేసు నమోదు చేసుకోవాలని బాబూఖాన్ అనే వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఎంత చలానా వేసినా కట్టేస్తానని ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. లేదంటే డీసీఎం వాహనం కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని రోడ్డుపై పడుకొని హంగామా సృష్టించాడు.

హోర్డింగ్‌లకు అనుమతులు తప్పనిసరి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్ పరిధిలో అనుమతులు లేని హోర్డింగ్‌లపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. బుధవారం కొన్ని భారీ హోర్డింగ్‌లను తొలగించిన అధికారులు గురువారం కూడా అనుమతి లేని హోర్డింగ్‌లను తొలగించి లారీపై తరలించారు. హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే సంస్థలు ము న్సిపల్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు హెచ్చరించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

దుండిగల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వేగంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దుండిగల్ పోలీసు స్టేషన్ పరిధిలోని చర్చిగాగిల్లాపూర్‌లో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని శోభని గ్రామానికి చెందిన ప్రశాంత్ ప్రియదర్శి (35) నగరంలో ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ చర్చిగాగిల్లాపూర్‌లో అద్దెకుంటున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రశాంత్ ప్రియదర్శి బార్బర్ షాపునకు వెళ్లొస్తానని భార్యకు చెప్పి బైక్‌పై బయలుదేరాడు. గ్రామంలోని ఆర్చ్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసుల డ్రైవర్ నర్సింహాపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

సర్వీస్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం: రెండు కార్లు దగ్ధం

నిజాంపేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మహేంద్ర గ్యారేజ్‌లో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగి రెండు కార్లు దగ్ధమయ్యాయి. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. రేణుకాఎల్లమ్మ కాలనీని ఆనుకొని ఉన్న మహేంద్ర మెకానిక్ సర్వీస్ స్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వచ్చాయి. మంటలను గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఫైర్ స్టేషన్ వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఒక కారు పూర్తిగా కాలిపోగా, మరొక కారు పాక్షికంగా కాలిపోయింది. సర్వీస్ స్టేషన్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గడ్డం మల్లేశ్

చోరీలు చేస్తున్న పాతనేరస్థుడి అరెస్టు

● రూ.11.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

● 44 కేసుల్లో నిందితుడు

జీడిమెట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటితాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న కరుడుగట్టిన ఓ పాతనేరస్తుడిని జీడిమెట్ల, బాలానగర్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం సీఐ గడ్డం మల్లేశ్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అపురూప కాలనీలో నివాసముంటున్న కోల్‌కతాకు చెందిన ఓ వ్యక్తి ఇంటికి తాళం వేసి తమ సొంత రాష్ట్రానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. మార్చి 6వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు నగలు, డబ్బు దొంగిలించుకుపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరా ఫుటేజీని సేకరించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 23వ తేదీన అనుమానాస్పదంగా తిరుగుతున్న పాతనేరస్తుడు బేగరి వేణుకుమార్(26)ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, తన స్నేహితుడు సంపత్‌సాయితో కలిసి అపురూపకాలనీలో బంగారు నగలు, డబ్బు దొంగిలించినట్టు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి పోలీసులు రూ. 11.5 లక్షల విలువచేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సంపత్‌సాయి పరారీలో ఉన్నట్టు తెలిపారు. బేగరి వేణుకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇతడు 44 కేసుల్లో నిందితుడని, పోక్సో, పీడీ యాక్టుల కింద గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని సీఐ తెలిపారు. సమావేశంలో డీఐ ఎస్.కనకయ్య, రాజు, ఎన్.శ్యాంబాబు, పోచయ్య, రాజశేఖర్, సుబ్బారావు, ఆంజనేయులు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.